క్లుప్తంగా

ఉర్సు ఉత్సవాలు ఆరంభం

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలో ఉర్సు ఉత్సవాలు శనివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏటా మాదిరిగానే ఖమ్మం అర్బన్ తహసీల్దార్ శైలజ ఉత్సవాలను ప్రారంభించారు. సందల్‌ను ఖమ్మం అర్బన్ తహసీల్ నుంచి ఊరేగింపుగా ఈద్గా వద్దకు తీసుకెళ్లి సమర్పించారు. తహసీల్దార్‌తో పాటు ఆర్ఐ రవి తదితరులు, ముస్లిం మత పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి



సభ్యత్వ కార్డు అందజేస్తున్న కమలాకర్

ఖమ్మంరూరల్: మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు పుచ్చకాయల కమలాకర్ అన్నారు. మండలంలోని తగనంపాడు గ్రామంలో నూతనంగా ఎన్నికైన మత్స్యశాఖ సభ్యులకు సభ్యత్వ కార్డులను అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సంఘ బలోపేతానికి సభ్యులు కృషి చేస్తూ మేలురకం చేపలను పెంచి ఆర్థిక స్వావలంభన సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేతినేని వేణు, మత్స్య సొసైటీ అధ్యక్షుడు చింతకాయల నాగయ్య, కార్యదర్శి గుమ్మాల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

'లవ్ యూ రామ్'లో జిల్లా నటీనటులు



దశరథ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నటులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంకు చెందిన ప్రముఖ దర్శకుడు కొండపల్లి దశరథ్ స్వీయ నిర్మాణ సారథ్యంలో డీ.వై.చౌదరి దర్శకత్వంలో చిత్రీకరించిన 'లవ్ యూ రామ్'చిత్రం ఖమ్మంలో ప్రదర్శిమవుతోంది. ఈ సినిమాలో ఖమ్మంకు చెందిన కొండపల్లి శ్రీనివాసరావు, యార్లగడ్డ కిరణ్, పాషా తదితరులు నటించారు. ఈమేరకు వారు శనివారం మాట్లాడుతూ యువతరం లక్ష్యాలు, కుటుంబ బంధాలను తెలియజేసేలా తీసిన ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరారు.

నేడు సినీ సంగీత విభావరి

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం సినీ సంగీత విభావరిని నిర్వహిస్తున్నట్లు స్వర మాధురి కల్చరల్ యూనిట్ అధ్యక్షుడు ఆదిరాజు పురుషోత్తమరావు తెలిపారు. ఈమేరకు శనివారం ఆయన మాట్లాడుతూ పద్మభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, పద్మభూషణ్ కృష్ణ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. అలనాటి మధుర గీతాలను నిర్మలా కామేష్, వీ.వీ.రెడ్డి, మేకల ఇజ్రాయిల్, కొలిశెట్టి సుధాకర్ తదితరులు ఆలపిస్తారని తెలిపారు. ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు మొదలయ్యే ఈ కార్యక్రమానికి కళాభిమానులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో సంస్థ ప్రతినిధులు ఆరెపల్లి పున్నయ్య, ఎస్.ప్రకాష్, పిన్నెల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఆదిపురుష్
వినోద	స్పై
సాయిరాం	సామజవరగమన
ఆదిత్య	లవ్ యూ రామ్
శ్రీనివాస	ఇండియానా జోనెస్
సుందర్	నారాయణ అండ్ కో

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	106	బచ్చలికూర	2
వంకాయ	36		10
బెండకాయ	40	పాలకూర	3
పచ్చిమిర్చి	106		10
కాకర	60	చుక్కకూర	2
బీర	50		10
దొండ	36	తోటకూర	2
పొట్లకాయ	46		10
చిక్కుడు	76	గోంగూర	2
గోరుచిక్కుడు	40		10
క్యాబేజీ	24	మెంతికూర	5
క్యాలీఫ్లవర్	50		20
ఆలుగడ్డ	26	కొత్తిమీర	1
చామగడ్డ	46		15
క్యారెట్	56	పుదీన	1
క్యాప్సికం	70		15

-ఖమ్మం వ్యవసాయం

అధ్వానంగా మారి!



పాలేరు-నర్సింహులగూడెం రహదారిలో ఏర్పడిన గుంత

కనీసం మరమ్మతులకు నోచుకోని పాలేరు-నర్సింహులగూడెం రోడ్డు

- పెద్దపెద్ద గుంతలతో అదుపు తప్పుతున్న వాహనాలు
- ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికుల ఆందోళన
- మట్టితోనైనా పూడ్చాలని ప్రజల వేడుకోలు
- చోద్యం చూస్తున్న అధికారులు

కూసుమంచి: మండలంలోని పాలేరు నుంచి బంగ్లా వెళ్లే రోడ్డులో పాలేరు-నర్సింహులగూడెం గ్రామాల మధ్య రహదారి దెబ్బతిని పెద్దపెద్ద గోతులతో అధ్వానంగా తయారైంది. కనీసం మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో వాహనాలు అదుపు తప్పుతూ తరచూ ప్రమాదాలు చోటు చేసుకుని గాయాలపాలవుతున్నారు. ఈ రహదారిలో పాఠశాలల బస్సులతో పాటు కూలీల ఆటోలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పుడు ఏం జరుగుతోందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

పోచారంలో రహదారి కోత..

మండలంలోని పెద్దపోచారం గ్రామం ముందు చెరువు వద్ద రహదారి కోతకు గురైంది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. అంతేకాక పలు గ్రామాల్లో రహదారులు అక్కడక్కడ దెబ్బతిన్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.

భారీ వాహనాలతో ధ్వంసం..

పాలేరు నుంచి నర్సింహుల గ్రామం వరకు ఉన్న రహదారి ప్రమాదభరితంగా మారింది. ముఖ్యంగా ఈ రహదారిపై మట్టి లోడు లారీలు ఎక్కువగా తిరుగుతుండడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడుతూ రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. ఈ రహదారిలో వాహనదారులే కాకుండా రైతులు నిత్యం తమ పొలాల వద్దకు వెళ్లి వస్తుంటారు. వారు రాత్రిళ్లు ప్రయాణించాలంటే భయాందోళన చెందుతున్నారు. గుంతల్లో కనీసం మట్టితోనైనా పూడ్చాలని కోరుతున్నారు. పాలేరు నుంచి బంగ్లా వెళ్లే ఈ రోడ్డులో ఇటీవల ధాన్యం లోడుతో వెళ్తున్న ఓ ట్రాక్టర్ టైరు గుంతల్లో ప్రయాణించడంతో ట్రాక్టర్ ఒరిగి ధాన్యమంతా రోడ్డుపాలైంది. ఇలా ప్రతి రోజు అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.



గుంతలో దిగబడిన ట్రాక్టర్ (ఫైల్)

మరమ్మతులు చేపట్టాలి..



పాలేరు నుంచి నర్సింహులగూడెం వరకు ఉన్న రోడ్డు బాగా దెబ్బతిన్నది. రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాటిల్లో వాహనాలు పడిపోయి గాయాలపాలవుతున్నారు. గుంతలు త్వరగా పూడ్చివేయాలి.

– బోయిన కృష్ణ, నర్సింహులగూడెం

ప్రతిపాదనలు పంపించాం..



పాలేరు – బంగ్లా రహదారిపై ఏర్పడ్డ గుంతలకు అవసరమైన మరమ్మతుల ప్రతిపాదనలను పైఅధికారులకు పంపించాం. ప్రస్తుతం తాత్కాలికంగా గుంతల్లో మట్టి నింపాం. త్వరలోనే పూడ్చే పనులు చేపడతాం.

– దేవేందర్, ఆర్అండ్‌బీ ఏఈ

'సికెల్‌సెల్' పరీక్షలు నిర్వహించాలి



వైద్య రిపోర్టును అందిస్తున్న డీఎంహెచ్‌ఓ మాలతి

కామేపల్లి (కారేపల్లి): ఆరు నుంచి పదిహేనేళ్లలోపు విద్యార్థులకు సికెల్‌సెల్ ఎనీమియా పరీక్షలను తప్పనిసరిగా చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి అన్నారు. శనివారం కామేపల్లి మండలపరిధిలోని తాళ్ళగూడెం గ్రామంలో సికెల్‌సెల్ కార్యక్రమాన్ని ఆమె సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు రక్తహీనత సమస్య ఉండకూడదనే ఉద్దేశంతో సికెల్‌సెల్ ఎనీమియా పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ రక్తంలో సికెల్ సెల్ ఎనీమియా నిర్ధారణ అయితే దానికి తగిన ప్రత్యేక మందులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు ప్రతీ పదిహేనేళ్ల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, నిర్ధారణ ఫలితాలను అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కామేపల్లి వైద్యులు చందన, శిరీష, తాళ్లగూడెం ఏఎన్ఎం తులసి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేత



ప్లేట్లు, గ్లాసులు అందిస్తున్న విజయమ్మ

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ చిన్నారులకు కందాల ఫౌండేషన్ ఆధ్వర్యాన ప్లేట్లు, గ్లాసులను ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సతీమణి కందాల విజయమ్మ చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను పరామర్శించి, ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శాంత, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న రజక సంఘం బాధ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: రజక సొసైటీలకు ప్రభుత్వ రంగ సంస్థలలో దోబీ సేవలు–రజక సొసైటీలే చేసేలా జీఓ జారీ చేయడం పట్ల సమైఖ్య రజక సంఘం ఆధ్వర్యాన శనివారం నగరంలోని చెరువుబజార్‌లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రజక సంఘం బాధ్యులు రేగళ్ల కొండలు మాట్లాడుతూ.. వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న రజక సొసైటీలకే ప్రభుత్వ దోబీ సేవలు చేసేలా ఉత్తర్వులు ఇవ్వడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి వీరబాబు, మిట్టపల్లి శంకర్, నరసింహ, చిక్కుళ్ల నాని, భోనగిరి ఉపేందర్, పగిళ్ళపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

సాయినాథుడికి జలాభిషేకం



మున్నేరు నది నుంచి జలాలను కలుశాలలో తీసుకొస్తున్న సాయి భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా శనివారం నగరంలోని రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీకృష్ణ సాయి ఆశ్రమంలో సాయినాథుడికి 108 కలుశాలతో మున్నేరు జలంతో జలాభిషేకం చేశారు. ముందుగా మృత్యుష నివారణకు, ఆరోగ్య ప్రాప్తికి సాయినాథునికి భస్మంతో అభిషేకం చేశారు. అనంతరం శని త్రయోదశిని పురస్కరించుకొని నవగ్రహ పాశుపత హోమం నిర్వహించారు. ఆశ్రమ కమిటీ చైర్మన్ లగడపాటి రామారావు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు సిద్ధంశెట్టి నాగమణి, చౌడవరపు మధుసూదన్‌రావు, కొదుమూరు శ్రీనివాసరావు, నరహరి రమేష్‌కుమార్, పుల్లఖండం వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

శని త్రయోదశి సందర్భంగా స్వామి వారి కల్యాణం..

నగరంలోని గాంధీచౌక్ శ్రీ వరప్రదాత షిర్డీ సాయి మందిరంలో శనివారం శని త్రయోదశిని పురస్కరించుకొని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మందిర కమిటీ చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి అర్వపల్లి నిరంజన్, కోశాధికారి కురువెళ్ల జగన్మోహన్‌రావు దంపతులు పాల్గొన్నారు.

సాఫీగా గ్రూప్–4

టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన గ్రూప్ 4 పరీక్ష సాఫీగా సాగింది. ఈ సందర్భంగా అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టారు. కాగా, పరీక్ష రెండు పూటల ఉండడంతో మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రతకు అభ్యర్థులకు కొంత ఇబ్బందులు పడ్డారు. కొందరు తల్లులు తమ చంటి బిడ్డలతో పరీక్షకు హాజరు కాగా మరికొందరు పరీక్ష కేంద్రాలకు ఆలస్యంగా రావడంతో అధికారులు అనుమతి లేదనడంతో వెనుదిరిగారు. – సాక్షి నెట్‌వర్క్



నేలకొండపల్లి ప్రభుత్వ కాలేజీలో తనిఖీ చేస్తున్న పోలీసులు



కూసుమంచి: డీఈఓ సోమశేఖరశర్మ తనిఖీ



కూసుమంచి: పరీక్షకు వెళ్లొస్తా.. నాన్న దగ్గరకు వెళ్లు నాన్న అంటూ..



కూసుమంచి: పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

సేవ చేయాలనే ఆలోచన గొప్పది

కలెక్టర్ వీ.పీ. గౌతమ్



బాధితుల కోసం ఏర్పాటు చేసిన బెడ్లను ప్రారంభిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం వైద్యవిభాగం: ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ వ్యక్తిగత సహాయకుడు బిట్రా ప్రవీణ్ పుట్టిన రోజు సందర్భంగా జిల్లా క్షయ ఆస్పత్రిలో బాధితులకు పరుపులను అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సేవలు చేయాలనే ఆలోచన గొప్పదని, పేద రోగులకు 25 కార్పొరేట్ పరుపులను అందజేయడం అభినందనీయమన్నారు. అంతేకాక చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు అందించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓ బి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మరు..



జూపెడలో ప్రచారం చేస్తున్న కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అవినీతిని కుటుంబపాలనను అడుగడుగునా ప్రశ్నిస్తూ ప్రజల పక్షాన పోరాడుతున్న బీజేపీని ఈ సారి ప్రజలు ఆదరిస్తారని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జూపెడ గ్రామంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ యాత్ర ముగింపు సభనా.. లేక మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న సభనా.. అనేది అర్థం కాక ప్రజలు ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన జనగర్జన సభను లైట్‌గా తీసుకుంటున్నారని పేర్కొన్నారు. గత ఆరు నెలలుగా కేసీఆర్‌ను గద్దె దింపుతామని ప్రకటించిన పొంగులేటి రేపోమాపో కాంగ్రెస్ పార్టీలో చేరి ఏమి సాధించబోతున్నారని ఎద్దేవా చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ జిల్లాలో తొమ్మిది సీట్లు సాధించినా.. ఏం జరిగిందో ప్రజలకు తెలుసని, కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. జిల్లాలో తమ పార్టీ ప్రజాప్రతినిధులు లేనప్పటికీ జిల్లా అభివృద్ధికి బీజేపీ పాటుపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి తిరిగి కరపత్రాల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు వెంకటరాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తక్కెళ్లపల్లి నరేందర్‌రావు, మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి ప్రసాద్, బీజేవైఎం మండల అధ్యక్షుడు గంటల లక్ష్మారెడ్డి, తిప్పారెడ్డి మల్లారెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



కోనాయిగూడెంలో పార్టీలో చేరుతున్న దృశ్యం

నేలకొండపల్లి: తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ జంగం లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మండలంలోని కోనాయిగూడెంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో మేకల పేరయ్య, తోట చలపతి, మేకల అర్జున్ తదితరులు తన అనుచరులతో కలిసి శనివారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజలు విసుగుచెంది పార్టీలో చేరినట్లు చెప్పారు. కేంద్రం, రాష్ట్రంలో పాలకులు ప్రజా సమస్యలను విస్మరించారని అన్నారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని చెప్పారు. నేడు(ఆదివారం) ఖమ్మంలో జరగనున్న తెలంగాణ ప్రజాగర్జనను విజయవంతం చేయాలని కోరారు. సభను అడ్డుకునేందుకు పాలకులు చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు కొచ్చేర్ల నాగమణి, కాంగ్రెస్ నాయకులు కొచ్చెర్ల శ్రీనివాసరావు, పి.కన్నారెడ్డి, కొచ్చేర్ల నాగేశ్వరరావు, గణేష్, రామిరెడ్డి, బోయినపల్లి తిరమలరావు, పగడాల నాగేంద్రబాబు, ఉల్లోజి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'జనగర్జన' విజయవంతానికి కృషి

తిరుమలాయపాలెం: ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన నేడు(ఆదివారం) నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ జనగర్జన సభను విజయవంతం చేయడానికి పార్టీ కార్యకర్తలు అహర్నిశలు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బెల్లం శ్రీనివాస్, జిల్లా నాయకుడు చావా శివరామకృష్ణ పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం తిరుమలాయపాలెంలో పార్టీ కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని ఊరూ వాడా నుంచి వేలాదిగా కార్యకర్తలు తరలివచ్చి సభను విజయవంతం చేసి మరోసారి కాంగ్రెస్ సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లమల్ల ఆనంద్, మాజీ ఎంపీపీ అశోక్, దొడ్డి సాంబయ్య, ఊడుగు ఉపేందర్, కళ్లెం వీరయ్య సర్పంచ్ లింగన్న, దొడ్డి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో కేఎంసీ ఎదుట ఆందోళన



ఆందోళన చేస్తున్న మహిళలు, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో రెండు రోజులుగా మంచినీళ్లు రావడం లేదని, వెంటనే నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మహిళలు శనివారం కేఎంసీ కార్యాలయం గేటు ఎదుట ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన మహిళలు ఖాళీ బిందెలతో కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్పొరేటర్‌లు మాట్లాడుతూ.. ఆదివారం ఖమ్మంలో జరిగే జనగర్జన సభకు మహిళలను రాకుండా అడ్డుకోవాలని ఉద్దేశపూర్వకంగానే నీటి సరఫరాను బంద్ చేశారన్నారు. సభకు జనం రాకుండా అన్ని రకాలుగా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, అధికార బీఆర్ఎస్ నాయకులు అన్ని అడ్డంకులు సృష్టించే కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. మంచినీళ్లు రాక నగర ప్రజలు అల్లాడిపోతున్నారని, వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, రఫీదా బేగం, మంజుల, నాయకులు కొప్పెర ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు



వైద్యుడు భారవిని సన్మానిస్తున్న దృశ్యం



డీఎంఏలో డాక్టర్స్‌డే వేడుకలు..



డాక్టర్లను సన్మానిస్తున్న యూనిటీ ఆఫ్ మాల బాధ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని మంచికంటి భవన్‌లో సీపీఎం టూటౌన్ కమిటీ, బీవీకే ఆధ్వర్యాన శనివారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన బాధితులను పరీక్షించి, మందులు అందజేశారు. అనంతరం ప్రముఖ వ్యాపారవేత్త దొడ్డా రవి మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో అందరికీ వైద్య సౌకర్యాలు అందించాలనే లక్ష్యంలో ప్రతి నెలా మెడికల్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాబోయే కాలంలో మరింతగా ఆధునిక వైద్య సౌకర్యాలు ఈ మెడికల్ క్యాంపులో కల్పించాలని కోరారు. కాగా శనివారం డాక్టర్ డే సందర్భంగా డాక్టర్లు సి.భారవి, రావిళ్ళ రంజిత్, కొల్లి అనుదీప్, పి.సుబ్బారావు, జెట్ల రంగారావు, జి.రాజేష్, ఆరీఫ్, షిషా తదితర వైద్యులను వైద్య శిబిర నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, కోటేశ్వరరావు, వై.శ్రీనివాసరావు, సుబ్బారావు, బోడపట్ల సుదర్శన్, శివనారాయణ, వాసిరెడ్డి వీరభద్రం, నర్రా రమేష్, పి.వాసు, అఫ్జల్, పి.కృష్ణారావు, అరుణ, టి.జనార్దన్, స్వామి, టి.వెంకట్రావు, వి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంఏలో సంబరాలు..

ఖమ్మం సహకారనగర్: డాక్టర్స్ డేను పురస్కరించుకొని డాక్టర్స్ మెడికల్ అకాడమీలో శనివారం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించినట్లు డైరెక్టర్లు రాయల సతీష్‌బాబు, ఈగా భరణిబాబులు తెలిపారు. అనంతరం నగరంలో విద్యార్థులు ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు.

యూనిటీ ఆఫ్ మాల ఆధ్వర్యాన..

ఖమ్మంగాంధీచౌక్: డాక్టర్స్ డే సందర్భంగా యూనిటీ ఆఫ్ మాల ఆధ్వర్యాన శనివారం ఖమ్మంలోని ఓ హోటల్‌లో వైద్యులు ఎంఎఫ్ గోపీనాథ్, స్వర్ణకుమారి, జగదీష్, కిరణ్, సుబ్బారావు, పవన్, శివకృష్ణ, రాజేష్, వేణుమాదవ్ తదితరులను సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ కార్పొరేటర్ బీజీ క్లెమెంట్‌తో పాటు సంస్థ అధ్యక్షుడు కందుల ఉపేందర్, కార్యదర్శి గుమ్మడి కనకరాజులు మాట్లాడుతూ.. డాక్టర్ బిదాన్ చంద్రరాయ్ వైద్య వృత్తినే కాకుండా స్వాతంత్ర్య సమరయోధుడిగా, సామాజిక కార్యకర్తగా సేవలందించి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు గులగుట్ట ఎల్లయ్య, సుఖబోగి కోటేశ్వరరావు, చిలకబత్తిని కనకరాజు తదితరులు పాల్గొన్నారు.